క్లుప్తంగా

31న బాలల శత సంకీర్తన పుష్పాంజలి

కె.కోటపాడు : ఈ నెల 31న బాలల శత సంకీర్తన పుష్పాంజలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కె.కోటపాడు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు తెలిపారు. సత్యసాయి బాబా శత వర్ష జన్మదినోత్సవ దీక్షల్లో భాగంగా బాల వికాస్ విద్యార్థులతో 100 మందితో 100 భజన పాటలను ఆలపించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు నారాయణపాత్రుడు తెలిపారు. స్థానిక రామాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

భారీ వర్షాలకు నీట మునిగిన పంటలు


వీరవల్లి అగ్రహారం శివారు కొత్తూరు వద్ద నీట మునిగిన వరి పంట

మాడుగుల రూరల్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో పల్లపు భూముల్లో వేసిన వరి పంట నీట మునిగింది. ఆడపా దడపా కురుస్తున్న వర్షాలతో పల్లపు భూముల్లో వేసిన వరి పంట నీట మునిగింది. ఈ వర్షాలకు ఇటీవల వేసిన వరి పంట పూర్తిగా మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులు అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల వరి పంట నీట మునిగింది. మళ్లీ అకస్మాత్తుగా వర్షాలు కురవడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. మండలంలో వీరవల్లి శివారు కొత్తూరు వద్ద పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. చెరువులా పంట పొలాలు కనిపిస్తున్నాయి. కె.జె.పురం, ముకుందపురం, మాడుగుల, వీరనారాయణం, తదితర గ్రామాల్లో పల్లపు భూముల్లో వేసిన వరి పంట నీట మునిగింది.

కాల్షియం కార్బైడ్‌తో పండ్లను మగ్గబెట్టొద్దు


పండ్ల వ్యాపారులకు కరపత్రాలను అందజేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

నర్సీపట్నం: పండ్లను మగ్గబెట్టేందుకు కాల్షియం కార్బైడ్‌ను వాడొద్దని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పండ్ల వ్యాపారులకు సూచించారు. ఏఎంసీ సెక్రటరీ భువనేశ్వరి, హార్టికల్చర్ ఆఫీసర్ రవితేజతో కలిసి గురువారం ఆయన పట్టణంలోని పండ్ల దుకాణాలను తనిఖీ చేశారు. అరటి, బొప్పాయి, సపోటా, దానిమ్మ, యాపిల్ పండ్లు అమ్మే షాపుల వద్దకు వెళ్లి కాల్షియం కార్బైడ్ వినియోగించవద్దని ముద్రించిన కరపత్రాలను వ్యాపారులకు అందజేసి అవగాహన కల్పించారు. షాపుల నుంచి పండ్ల శాంపిల్స్‌ను సేకరించారు. పండ్లు మగ్గబెట్టేందుకు రసాయనాలు వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సహజసిద్ధంగా మగ్గబెట్టిన పండ్లను మాత్రమే అమ్మాలని సూచించారు.

2,450 ఎకరాల్లో వరినాట్లు


వరినాట్లు వేస్తున్న కూలీలు

మాకవరపాలెం: మండలంలో ఇప్పటి వరకు 2,450 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని ఏవో అప్పారావు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలు వరి రైతులకు అనుకూలించాయి. ఈ నేపథ్యంలో జంగాలపల్లి, తామరం, మాకవరపాలెం, పి.పి.అగ్రహారం, కొండల అగ్రహారం, లచ్చన్నపాలెం, బయ్యవరం, తదితర గ్రామాల్లో ముమ్మరంగా వరినాట్లు వేసే పనులు జరుగుతున్నాయి. ఏటా మండలంలో వర్షాలు అనుకూలిస్తే ఖరీఫ్ సీజన్లో సుమారు 1400 హెక్టార్లలో నాట్లు జరుగుతాయి. అయితే ఇప్పటివరకు 15 రైతు సేవా కేంద్రాల పరిధిలో 2,450 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని ఏవో గురువారం తెలిపారు. నాట్లు వేసే ముందు ఎకరానికి 50 కేజీల డీఏపీని వేసుకోవాలని రైతులకు సూచించారు.

గంజాయి తరలింపుపై డ్రోన్‌తో నిఘా


గంజాయి తరలింపు మార్గాలను డ్రోన్‌తో పరిశీలిస్తున్న కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్

రావికమతం: గంజాయి రవాణా, అసాంఘిక కార్యకలాపాలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు పోలీసులు అవసరమైన చర్యలు చేపట్టారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు కొత్తకోట పోలీసులు నిఘా పెట్టారు. ఇందులో భాగంగా జెడ్.బెన్నవరం పంచాయతీ కిత్తంపేట గ్రామ సమీప ప్రాంతాల్లో గురువారం కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి డ్రోన్ కెమెరా ద్వారా కాలిబాటలను గుర్తించేందుకు సర్వే చేశారు. గంజాయి రవాణా మార్గాలను డ్రోన్ ద్వారా గుర్తించి నియంత్రిస్తామని ఎస్ఐ తెలిపారు.

ఏకదంతాయ.. వక్రతుండాయ

- ఘనంగా వినాయక చవితి పూజలు
- వాడవాడలా కొలువుదీరిన గణనాథుడు

పార్వతీ తనయుడు మండపాల్లో కొలువుదీరాడు. వినాయక నవరాత్రి ఉత్సవాలు నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీలు తమ శక్తి మేరకు మండపాలను అలంకరించి బాణసంచా, మేళతాళాలతో గజాననుడిని ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్టించారు. ఈ ఏడాది ప్రజలలో పర్యావరణంపై అవగాహన కారణంగా ఎక్కువగా మట్టి ప్రతిమలనే ప్రతిష్టించారు. విద్యా సంస్థలు, కార్యాలయాలు, మార్కెట్లు, కార్మిక సంఘాలు విఘ్నాధిపతిని ప్రతిష్టించి పూజలు చేశారు. తొలిరోజే పలు చోట్ల నిమజ్జనోత్సవం నిర్వహించారు. మండపాల వద్ద బైటో భజన కార్యక్రమాలు, హరే నామ సంకీర్తనలు, గణపతి హోమాలు నిర్వహించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు.


ముకుందపురంలో ఆకర్షణీయంగా ఆదియోగి రూపంలో మండపం


ఏఎల్‌పురంలో 18 మెట్లపై అయ్యప్ప రూపంలో కొలువుదీరిన గణనాథుడు


మర్రిమాను వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం


కె.కోటపాడులో వినాయకుడికి పూజలు చేస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్


కె.జె.పురంలో కాయగూరలతో తయారు చేసిన గణనాథుడిని ఊరేగిస్తున్న దృశ్యం


రోలుగుంటలో గణపతి ఊరేగింపు


కె.జె.పురంలో గణేశ్‌నగర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు


అయ్యరక వీధిలో ఏర్పాటు చేసిన 22 అడుగుల మట్టి వినాయక విగ్రహం


దొండపూడిలో..


నాతవరంలో..

గొలుగొండ : వరసిద్ధి వినాయకుడిని వాడవాడలా భక్తి శ్రద్ధలతో అర్చించారు. మండలంలోని ఏఎల్‌పురం, చీడిగుమ్మల, గొలుగొండ, ఏటిగైరంపేట తదితర గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరిపారు. గొలుగొండలోని పండా వీధిలో చిన్నారులు ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం వినాయక నిమజ్జనం చేశారు. ఏఎల్‌పురంలో పలు వీధుల్లో ప్రత్యేక ఆకృతుల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేశారు.

మాడుగుల: మండలంలోని 29 పంచాయతీల్లో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాడుగుల మూడు రోడ్ల కూడలిలో బాల వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సత్యవరం, మాడుగుల, జేడీపేట, కింతలి, జంపెన, తాటిపర్తి, శంకరం, సాగరం, గాదిరాయి, వీరనారాయణం, తదితర గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

కె.కోటపాడు: కె.కోటపాడులో గణేష్ యూత్ ఏర్పాటు చేసిన వినాయకునికి ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రెడ్డి జగన్‌మోహన్, ఉప సర్పంచ్ రెడ్డి అరుణ ప్రత్యేక పూజలు చేశారు. ఎ.కోడూరులోని సిద్ధిబుద్ధి సహిత వినాయక స్వామి ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు జరిపారు.

మాడుగుల రూరల్: ముకుందపురం రామాలయం వద్ద స్థానిక యూత్ సభ్యులు సారథ్యంలో ఆదియోగి ఆకారంలో ఏర్పాటు చేసిన మండపం ఆకట్టుకుంటుంది. కె.జె.పురంలో కళాకారుడు శరగడం ప్రసాదు రూపొందించిన కాయగూరలతో గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక గణేశ్‌నగర్‌లో బొడ్డేడ రామారావు (టెంట్ హౌస్ రాము ఇంటి వద్ద), దిబ్బవీధిలో ఓంశాంతి మందిరంలో పవర్ టాలెంట్ యూత్ ఆధ్వర్యంలో గణనాథుడిని ప్రతిష్టించారు. పలు చోట్ల అన్నసమారాధన నిర్వహించారు.

రోలుగుంట: ఆది దేవుడు వినాయక చవితి వేడుకలను మండలంలోని గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సిద్ధి వినాయక సంఘ సభ్యులు భారీ గణపతిని వాహనంపై రోలుగుంట వీధుల్లో ఊరేగించారు. భక్తులు తమ ఇళ్లల్లో కుటుంబ సమేతంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.

నర్సీపట్నం: వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఊరువాడల్లో ఉత్సవ శోభ నెలకొంది. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కుటుంబ సభ్యులతో కలిసి తన నివాసంలో గణపతి పూజ చేశారు. విఘ్నాలు తొలగి నియోజకవర్గ ప్రజలకు మంచి చేకూర్చేలా వినాయకుడి ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. పట్టణంలోని పలు వార్డుల్లో ప్రత్యేక చవితి పందేళ్లు నిర్మించి వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అయ్యరక వీధిలో 22 అడుగుల భారీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బలిఘట్టం బీసీ కాలనీ వినాయక ఆలయం వద్ద 14 అడుగుల త్రిముఖ మట్టి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బలిఘట్టం ఎస్సీ కాలనీలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో రాజకీయ నాయకుడు గుడబండి నాగేశ్వరరావు సహకారంతో వినాయకుడిని కరెన్సీ నోట్లతో అలంకరించారు.

రావికమతం: మండలంలోని రావికమతం, కొత్తకోట, దొండపూడి, మత్స్యవానిపాలెం, మేడివాడ, టి.అర్జాపురం తదితర గ్రామాల్లో ప్రత్యేక మండపాల్లో గణనాథుడు కొలువుదీరాడు. తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు అనంతరం నిమజ్జనం చేయనున్నారు.

నాతవరం: మండలంలో వాడవాడలా వినాయక చవితి పండగను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. జిల్లేడుపూడి, నాతవరం గ్రామాల్లోని వినాయకుడి ఆలయాల్లో బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ఆకృతులతో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. సాయంత్రం భజనలు, కోలాటాలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

చీడికాడ: మండలంలోని బుధవారం వినాయక నవరాత్రి సంబరాలు ప్రారంభమయ్యాయి. వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి, గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లలో పూజించిన వినాయకుడిని సాయంత్రం నిమజ్జనం చేశారు.

చోడవరంలో 63 అడుగుల భారీ గణపతి విగ్రహం

చోడవరం: మునుపెన్నడూలేని విధంగా ఈ ఏడాది భారీ గణపతి విగ్రహాలను ఏర్పాటు చేశారు. చోడవరం పట్టణంలో హార్డింజ్ గెస్ట్‌హౌస్ ఆవరణలో 63 అడుగుల భారీ గణేష్ విగ్రహం ఆకట్టుకుంటోంది. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా కళాకారులను తీసుకొచ్చి పూర్తిగా మట్టితో ఈ విగ్రహాన్ని తయారు చేశారు. త్రిశూలం ధరించి నిల్చున్న ఉన్న స్వామివారి నిలువెత్తు విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా మండపాన్ని తయారు చేసి భారీ సెట్టింగ్‌తో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. భక్తుల సందర్శనార్థం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. చోడవరం ప్రాంతంలో మొదటిసారిగా భారీ గణనాథుడిని ఏర్పాటు చేయడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకుంటున్నారు. పాత బస్టాంగ్, కొత్తూరు జంక్షన్, చినబజార్, కో–ఆపరేటివ్ కాలనీ, గంధవరం, వెంకన్నపాలెం, గాంధీగ్రామం, గోరీపట్నం, నర్సయ్యపేట, పీఎస్‌పేట, నర్సాపురం, శీమునాపల్లి, రాయపురాజుపేట, లక్కవరం మైచర్లపాలెం, గవరవరం, ఖండిపల్లి, లక్ష్మీపురం, బెన్నవోలు, చాకిపల్లి, రామజోగిపాలెం, దుడ్డుపాలెం, గోవాడ, అంబేరుపురం, జుత్తాడ, గజపతినగరం ప్రాంతాల్లో భారీ సెట్టింగ్‌లతో పెద్ద పెద్ద విగ్రహాలను నెలకొల్పారు.

ఆకర్షణీయంగా గణనాథుడి మండపాలు


తారువలో యువకులతో కలిసి వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


మొండివీధిలో శ్రీకృష్ణుని చేతిలో పిల్లన గ్రోవికి ఊయల ఊగుతున్న గణనాథుడు

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా విఘ్నాలు తొలగించే వినాయక చవితి వేడుకలను భక్తజనం ఘనంగా జరుపుకొంది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మండపాల్లో వివిధ రూపాల్లో ఉన్న వినాయక ప్రతిమలను కొలువుదీర్చారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. తారువలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకొని పూజలు చేశారు. ఎ.కొత్తపల్లిలో గణనాథుడికి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ప్రత్యేక పూజలు జరిపారు. దేవరాపల్లి మొండివీధి హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని చేతిలో పిల్లన గ్రోవికి మధ్యలో ఊయల ఊగుతున్నట్లు ఉన్న వినాయకుడు ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


కాలనీలో గణేశ్‌కు పూజలు చేస్తున్న భక్తులు


మత్స్యవానిపాలెంలో వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో ఆకట్టుకుంటున్న గణనాథుడు


బలిఘట్టం బీసీ కాలనీలో వినాయక ఆలయం వద్ద 14 అడుగుల త్రిముఖ మట్టి విగ్రహం


బలిఘట్టం ఎస్సీ కాలనీలో నోట్లతో అలంకరించిన విఘ్నేశ్వరుడు


కుటుంబ సభ్యులతో కలిసి వినాయకుడికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

స్త్రీశక్తి పథకాన్ని రద్దు చేయాలని ఆటోడ్రైవర్ల ఆందోళన


చోడవరం కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

చోడవరం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించే స్త్రీశక్తి పథకాన్ని వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆటో డ్రైవర్లకు జీవన భృతి ఇవ్వాలని కోరుతూ ఏఐటీయూసీ, మోటారు వెహికల్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు గురువారం ఆందోళనకు దిగారు. చోడవరం పట్టణంలో ఉన్న అన్ని ఆటో స్టాండ్ల నుంచి పెద్ద సంఖ్యలో డ్రైవర్లు పాల్గొన్ని మెయిన్ రోడ్డుపై ర్యాలీ చేసి కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దొరబాబు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడం వల్ల ఆటో డ్రైవర్ల జీవనాధారం పూర్తిగా పోయిందన్నారు. బేరాలు లేక ఆటోలకు ఫైనాన్స్‌లు కట్టలేక, అప్పులపాలయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. గత ప్రభుత్వం ఏడాదికోసారి వాహనమిత్ర పథకం ద్వారా రూ.10వేలు ఇచ్చి తమను ఆదుకుందని, తమ జీవనాధారానికి ఎటువంటి ఆటంకం కలిగించలేదని పలువురు ఆటో డ్రైవర్లు చెప్పారు. తక్షణం స్త్రీశక్తి పథకాన్ని రద్దుచేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో చోడవరం పట్టణంతో పాటు పరిసర గ్రామాల పరిధిలో ఉన్న ఆటో సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి


మాడుగులలో నిరసన తెలుపుతున్న సీపీఎం మండల కార్యదర్శి నరసింహమూర్తి

మాడుగుల: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మాడుగులలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలపై అనుసరిస్తున్న మొండివైఖరిని విడనాడాలన్నారు. రైతులకు మేలు జరిగేలా చట్టాలు తేవాలన్నారు. అదాని స్మార్ట్ మీటర్లను బిగించొద్దని, విద్యుత్ చార్జీల ట్రూ ఆఫ్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు బషీర్ బాగ్ కాల్పుల్లో మృతి చెందిన విద్యుత్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుందరరాజు, కె.చిన్న, కె.నాగరాజు, షేక్‌జిలానీ, సాగాని పోతురాజు పాల్గొన్నారు.

రోలుగుంట: స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించి, అధికారంలోకి వచ్చాక సమర్థిస్తున్న టీడీపీ ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం అర్ల గ్రామస్తులతో కలిసి సీపీఎం నాయకుడు చిరంజీవి గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాని స్మార్ట్ మీటర్లను పగల గొట్టండి అన్న టీడీపీ నాయకులు నేడు నోరు విప్పకపోవడాన్ని ఆయన ఖండించారు. ఇప్పటికైనా అదాని స్మార్ట్‌మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రావికమతం: మండలంలో గిరిజన గ్రామాలైన చీమలపాడు, టి.అర్జాపురం పరిధిలో కళ్యాణపులోవ, దోలవానిపాలెం గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బషీర్‌బాగ్‌లో పోలీసుల కాల్పుల్లో మరణించిన అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు మాట్లాడుతూ ట్రూ ఆఫ్ చార్జీలు, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలన్నారు. సింగారపు వలసయ్య, పాడి బెన్నయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల్లో మొక్కలు నాటి నిరసన


కొత్తకోటలో గుంతల్లో మొక్కలు నాటుతూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రావికమతం: కొత్తకోటలో బీఎస్ రోడ్డుపై గుంతల్లో సీపీఎం ఆధ్వర్యంలో మొక్కలు నాటుతూ బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. చోడవరం నుంచి నర్సీపట్నం మధ్య బీఎస్ రోడ్డుపై నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చోడవరం నుంచి నర్సీపట్నం వరకు భారీ గోతులు ఏర్పడ్డాయి. వడ్డాది వద్ద పెద్దేరు వంతెన, విజయరామరాజు పేట దగ్గర బొడ్డేరు వంతెన కూలిపోయాయి. ఇప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. గతంలో చోడవరం నుంచి నర్సీపట్నం వెళ్లాలంటే 1.30 గంటలు సమయం పట్టేది. ఇప్పుడు సుమారు 3 గంటలు పడుతుందని, తక్షణమే వడ్డాది, విజయరామరాజు పేటల వద్ద బ్రిడ్జితో పాటు రోడ్డు పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పూడి అర్జునరావు, గిరిజన సంఘం నాయకులు గెమిలి వాసు, జోగిరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: సీఎం చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి కూటమి ప్రభుత్వ తీరును ఎండగడదామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో గురువారం మున్సిపాలిటీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 28 వార్డుల్లో సమర్థవంతంగా పని చేసేవారితో బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీ పటిష్టంగా ఉండాలంటే బూత్ కమిటీలు కీలకమన్నారు. త్వరితగతిన బూత్ కమిటీలను పూర్తి చేయాలన్నారు. వార్డుల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వార్డు కమిటీల నాయకులు దృష్టిసారించాలన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో వందలాది హామీలిచ్చి గాలికి వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వానికి అమరావతి తప్ప ప్రజలు సమస్యలు పట్టడం లేదన్నారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు తొలగించడంతో దివ్యాంగులు రోడ్డున పడ్డారన్నారు. వారందరికీ మనంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో చాలా మంది రైతులకు కోత విధించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మనంతా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, నియోజకవర్గ బూత్ కన్వీనర్ సుర్ల శేఖర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తమరాన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'


పలు సూచనలు చేస్తున్న ఏవో రమేష్‌బాబు

రావికమతం: మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్‌బాబు ఆధ్వర్యంలో చీమలపాడు, జెడ్.కొత్తపట్నం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పొలంలో కాలి బాటలు తీయడం వల్ల వరి పంటకు గాలి, వెలుతురు సమంగా అంది ఎన్నో ప్రయోజనలు కలుగుతాయని ఏవో సూచించారు. నారు వేసే ముందు చివర్లు తుంచి వేసి నాటాలని చెప్పారు. వరి నాట్లు లోతులో కాకుండా పైపైన వేసుకోవడం వల్ల మొన తొందరగా పెరుగుతుందన్నారు. నాటిన 30 రోజుల్లో కలుపు నివారణ చేపట్టాలన్నారు. రైతు సేవా కేంద్రాల వ్యవసాయ అసిస్టెంట్‌లు శివ, మాధురి పాల్గొన్నారు.

యూరియా కోసం అన్నదాతల అగచాట్లు


వేచలంలో యూరియా కోసం ఎగబడిన అన్నదాతలు

దేవరాపల్లి: మండలంలో వేచలంలో యూరియా కోసం అన్నదాతలు నానా అగచాట్లు పడ్డారు. స్థానిక వ్యవసాయ సిబ్బంది నిర్లక్ష్యంతో గంటల కొద్ది నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక రైతు సేవా కేంద్రంలో 260 బస్తాల యూరియా ఉన్నప్పటికీ స్థానిక అగ్రికల్చర్ పంపిణీలో అలసత్వం ప్రదర్శించడంతో నానా అవస్థలు పడ్డారు. యూరియా కోసం రైతు సేవా కేంద్రానికి వచ్చిన రైతులకు ఇవ్వకుండా ఇప్పటి వరకు యూరియా తీసుకోని వారికి మాత్రమే ఇస్తానంటూ అగ్రికల్చర్ అసిస్టెంట్ తెగేసి చెప్పడంతో స్థానిక రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. ఇలా రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదంటూ ఆమెను నిలదీశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమ భూ విస్తీర్ణం తగ్గట్టుగా ఎరువులు అందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు తీసుకోని వారికి మాత్రమే ఇస్తామని కొత్త నిబంధనలు విధించడం దారుణమన్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మను వివరణ కోరగా వేచలం యూరియా పంపిణీలో నెలకొన్న సమస్య తన దృష్టికి వచ్చిందని, ప్రతి రైతుకు యూరియా అందించాలని సూచించానన్నారు.

బస్సుల్లో పురుషుల సీట్లు మహిళలకు వద్దు


జిల్లా అధికారి ప్రవీణకు వినతిపత్రం అందిస్తున్న కొణతాల హరనాథ్‌బాబు

అనకాపల్లి: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల పురుషులు ఇబ్బందులు పడుతున్నారని ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు వాపోయారు. ఈ మేరకు పురుషుల సీట్లు వారికి మాత్రమే కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని గురువారం ప్రజా రవాణా శాఖ జిల్లా అధికారి వి.ప్రవీణకు వినతిపత్రం అందజేశారు. వివిధ పనులపై సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లే పురుషులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు.